# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-10-2023 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

❖ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెండు రోజుల పర్యటన నిమిత్తం దేశ రాజధాని ఢిల్లీ చేరుకున్నారు.

❖ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు పూర్తి సహకారం అందిస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు.

❖ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి రిమాండ్‌ను ఏసీబీ కోర్టు ఈనెల 19వ తేదీ వరకు పొడిగించింది.

❖ మారుమూల గ్రామాల్లోనూ 4జీ సేవలను అందచనున్నట్టు బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం వెల్లడించారు.

=============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఐదు వేల కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఈరోజు శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, రాజస్థాన్ ప్రాచీన భారతదేశ పరాక్రమం, సౌభాగ్యం, సంస్కృతికి నిదర్శనమని పేర్కొన్నారు. భారతదేశ గత వైభవాన్ని ప్రతిబింబించే రాజస్థాన్, భారతదేశ భవిష్యత్తుకు కూడా ప్రాతినిధ్యం వహించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకూ, ప్రతి రంగంలో వేగవంతమైన అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాన మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

=============================

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ రోజు ఢిల్లీ చేరుకున్నారు. రెండు రోజుల పాటు దేశ రాజధానిలో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. మరి కాసేపట్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌తో భేటీ కానున్న ముఖ్యమంత్రి, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ బకాయిలపై చర్చించనున్నారు. రేపు ఉదయం విజ్ఞాన్ భవన్‌లో వామపక్ష తీవ్రవాద నిర్మూలనపై జరగనున్న సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొంటారు. రేపు రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమావేశం కానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆత్మనిర్భర భారత్ కింద త్వరలో స్వదేశీ 4జీ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఆంధ్రప్రదేశ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం తెలిపారు. విశాఖపట్నంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వదేశీ 4జీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్రం నుంచి ఇప్పటికే ఆదేశాలొచ్చాయని, అందుకు తగ్గ ప్రక్రియ కూడా ఊపందుకుందన్నారు. మారుమూల గ్రామాల్లోనూ సేవలందించేందుకు 4జీ స్యాచురేషన్ ప్రాజెక్టు సిద్ధమైందన్నారు. వినియోగదారుల భద్రతకు బీఎస్ఎన్ఎల్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. వృద్ధుల్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికీ ల్యాండ్‌లైన్ సేవల్ని కొనసాగిస్తున్నామని, ఎటువంటి రేడియేషన్ లేని సేవలు ల్యాండ్ లైన్ ద్వారానే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా క్రీడలలో ఈ రోజు జరిగిన ఆర్చరీ కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత్ అద్భుత ప్రదర్శనకనబరిచి రెండు స్వర్ణపతకాలు సాధించింది. చైనాలోని హెంగ్జూ వేదికగా జరిగిన మహిళల ఆర్చరీ కాంపౌండ్ ఫైనల్లో వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్ లతో కూడిన భారత జట్టు చైనీస్ తైపీని ఓడించి స్వర్ణం కైవసం చేసుకోగా, పురుషుల విభాగంలో అభిషేక్ శర్మ, ఓజాస్ డియోటలే, ప్రథమేష్ జాకర్ లు కొరియాపై విజయంతో స్వర్ణ పతకం సాధించారు. ఆసియా క్రీడలలో బంగారు పథకం సాధించిన క్రీడాకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఆర్చరీ విభాగంలో స్వర్ణం సాధించిన వీ.జే.సురేఖ, పరిణీత్, అదితి గోపీచంద్ స్వామిలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడకు చెందిన సురేఖ సాధించిన విజయంపై రాష్ట్రమంతా గర్వపడుతోందన్న ఆయన, తెలుగు జెండా రెపరెపలాడుతోందంటూ ట్వీట్ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి రిమాండ్‌ను ఈనెల 19వ తేదీ వరకు పొడిగిస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జ్యుడిషియల్ రిమాండ్ పొడిగించాలంటూ ఏసీబీ కోర్టులో సీఐడీ మెమో దాఖలు చేయగా, దీనిని పరిగణనలోకి తీసుకున్న ఏసీబీ కోర్టు, జ్యుడిషియల్ రిమాండ్‌ను రెండు వారాల పాటు పొగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇదే కేసులో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. రేపు మధ్యాహ్నం ఇరుపక్షాల వాదనలు వింటామని ఏసీబీ కోర్టు వెల్లడించింది. మరోవైపు హైకోర్టులో ఫైబర్ గ్రిడ్ కేసుపై వాదనలు ముగిసాయి. చంద్రబాబు ముందస్తు బెయిల్ పై ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు కావాల్సిన పూర్తి సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్ నాథ్ తెలిపారు. స్టార్టప్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల మహిళా పారిశ్రామికవేత్తల సదస్సును మంత్రి ఈ రోజు విశాఖపట్నంలో ప్రారంభించారు. మహిళలు వ్యవస్థాపకులుగా విజయవంతం కావడానికి అవసరమైన సహాయాన్ని అందించడంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వుందన్నారు. నాస్కామ్ అండ్ డెల్లాయిట్ సంస్థ ఇచ్చిన నివేదికలో ఎమెర్జింగ్ ఇన్నోవేషన్ హబ్స్ గా దేశంలో 27 ప్రదేశాలను గుర్తించగా, వాటిలో ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాలు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో అంతర్జాతీయ పెట్టుబడులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' కారణంగా విదేశీ పెట్టుబడుల శాతం గణనీయంగా పెరుగుతోంది. అంతర్జాతీయ సహకారాన్ని పెంచుకుంటూ విదేశాల్లోని భారత దౌత్య కార్యాలయాల ద్వారా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించే కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. వీటి ద్వారా దేశ అభివృద్ధి ప్రస్థానంలో పాలు పంచుకునేందుకు ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులను నవ భారతం ఆహ్వానిస్తోంది. ఈ దిశగా ఇప్పటివరకూ 27 రంగాల్లో గణనీయమైన పురోగతి నమోదైంది. దేశంలో 2006 నుంచి 14 మధ్య ఎనిమిదేళ్ల కాలంతో పోలిస్తే 2014 నుంచి 2022 మధ్య 8 సంవత్సరాల్లో 'మేక్ ఇన్ ఇండియా' వల్ల తయారీ రంగంలో 'ఎఫ్ డీ ఐ' వృద్ధి 57 శాతంగా నమోదైంది. ఇటీవల చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, వాణిజ్య సౌలభ్య కల్పన చర్యల వల్ల దేశం 100 బిలియన్ డాలర్ల 'ఎఫ్ డీ ఐ'ని ఆకర్షించే దిశగా ముందుకు సాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారతదేశం 2033 నాటికి 8 నుంచి 10 శాతం భాగస్వామ్యం సాధించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలు తప్పక నెరవేరుతాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్ నాథ్ అన్నారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఆధ్వర్యంలో విశాఖలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం 2 శాతం వున్న మన వాటా, చంద్రయాన్ -3 విజయంతో తప్పక వృద్ధి సాధిస్తుందనే విశ్వాసం బలపడిందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనదేశ శక్తియుక్తులకు ఇస్రో సాధించిన విజయాలే నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో భాగంగా ఇస్రో ఈ రోజు విశాఖపట్నం సాగర తీరంలో "స్పేస్ వాక్" అవగాహన ర్యాలీని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీహరికోటలోని అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్త, ఇస్రో విశాఖ రీజియన్ సబ్ కమిటీ ఛైర్మన్ జి.అప్పన్న మాట్లాడుతూ, అంతరిక్ష పరిశోధన రంగంలో యువత భాగస్వామ్యం పెరగాలని అన్నారు. చంద్రయాన్ విజయం భారతీయుల్లో కొత్త శక్తిని, అంతరిక్ష పరిశోధనలపై యువతలో ఆసక్తిని కలిగించాయని అన్నారు. అంతరిక్ష విజ్ఞానం తోనే మానవ అభివృద్ధి సాకారం అవుతుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల మధ్య సంబంధాలు మరింత దృఢపడేందుకు రైల్వే శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విభాగాలతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎమ్.రామకృష్ణ తెలిపారు. ఈ రోజు ఆయన గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ, డీఆర్ఎం కప్ పేరుతో తొమ్మిది రోజులపాటు జరిగే ఈ క్రీడా సంబరాలలో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని 7 జిల్లాలలోని రాష్ట్ర ప్రభుత్వ విభాగాల నుండి వివిధ జట్లతో పాటు జీఎస్టీ, ఓఎన్‌జీసీ, కస్టమ్స్ విభాగాలు కూడా ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు వివరించారు. పర్యావరణ పరిరక్షణ అనే నినాదాన్ని ప్రజలలోకి తీసుకు వెళ్లటానికి ఈ క్రీడా సంబరాల మస్కట్ గా నల్లమల అడవులలో నివశించే "దేవాంగి పిల్లి"ని ఎంపిక చేశామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం 33 శాతం రిజర్వేషన్లను తీసుకురావడం హర్షించదగ్గ విషయమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్ కె రోజా అన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో, మహిళా అభ్యున్నతిపై జరిగిన సదస్సులో మంత్రి మాట్లాడుతూ, మహిళా సాధికారిత దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు, ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. మహిళాభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు పరుస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా గ్రామాల్లో అందుతున్న ప్రత్యేక వైద్య సేవలు హర్షణీయమని జె-పాల్ అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈరోజు ఎన్టీఆర్ జిల్లా మూలపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సంస్థ ప్రతినిధులు సందర్శించారు. అనంతరం రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జె.నివాస్ ను కలిసిన జె-పాల్ ప్రతినిధులు, వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు ప్రశంశనీయమని పేర్కొన్నారు.

==============================

==============================